నేడు మకరజ్యోతి

ఆదోని అర్బన్ : రణమండల కొండలో వెలిసిన రణమండల ఆంజనేయస్వామి వెనకభాగంలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామికి సంక్రాంతి పండగ సందర్భంగా ఆదివారం మకరజ్యోతిని వెలిగించనున్నారు.

భక్తజన ఆరాధ్యా.. రామలింగేశ్వర

- నేటి నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలు
- 16న రాంపురంలో మహారథోత్సవం
- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు

మంత్రాలయం : ఆరాధ్యులకు అభయము నొసగే దేవుడు.. కొలిచే వారి కల్పతరువు శ్రీ రామలింగేశ్వరుడు. మండలంలోని రాంపురం గ్రామంలో తుంగభద్ర నది ఒడ్డున వెలిశాడు. శ్రీరాముడు అరణ్యవాసం చేస్తూ తుంగా తీరంలో పర్యటించారు. ప్రాతఃకాల పూజ నిమిత్తం సైకతంతో లింగాన్ని ప్రతిష్ఠించి పూజలు గావించారు. శ్రీరాముడితో ప్రతిష్ఠింపబడటంతో రామలింగేశ్వరుడుగా పేరుగాంచారు. ఏటా శుద్ధ ఏకాదశిన (సంక్రాంతి కనుమ) రామలింగేశ్వరుడి జాతర, మహారథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. రాంపురం సోదరులు మాజీ ఎంపీపీ వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు



రామలింగేశ్వర స్వామి మూలవిరాట్

వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఉత్సవ విశేషాలు..

ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం రాత్రి అంకురార్పణ సేవ, దేవతారాధన, గోపుర కలశ ప్రతిష్ఠాపన గావిస్తారు. అలాగే రాత్రి పార్వతీ పరమేశ్వర కల్యాణోత్సవం ఉంటుంది. సోమవారం రాత్రి స్వామిని పురవీధుల్లో ఊరేగించి మహారథోత్సవం జరిపిస్తారు. మంగళవారం సర్వసమర్పనోత్సవం, వసంతోత్సవం ఉంటుంది. ప్రముఖులకు తాంబూలాదులతో సత్కారం ఉంటుంది. జాతర సందర్భంగా గ్రామంలో యువకులు కోలాటాలు, క్రీడాపోటీలు, భజనలు ఏర్పాటు

అందరూ ఆహ్వానితులే



శ్రీరామలింగేశ్వరస్వామి మా ఊరి దైవం. మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నాం. ఉత్సవానికి అందరూ ఆహ్వానితులే. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు భోజన వసతి కల్పించాం. ప్రజలు తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలి. – వై.బాలనాగిరెడ్డి, ఎమ్మెల్యే

శ్రీ మఠంలో భక్తుల సందడి



భక్తులకు సప్త ముద్రా ధారణ చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం : రాఘవేంద్ర స్వామి మఠంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. సంక్రాంతి సెలవులు కావడంతో భక్తులు తరలివస్తున్నారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుంచి అత్యధికంగా వస్తున్నారు. భక్తుల రాకతో శనివారం శ్రీ మఠం వీధులు కిటకిటలాడాయి. ఇదిలా ఉండగా.. క్షేత్రంలో జరుగుతున్న వంద, 200 గదుల సముదాయాలు, మ్యూజియం పనులను పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు తనిఖీ చేశారు. అన్నపూర్ణ భోజనశాలలో అన్న ప్రసాదాన్ని పరిశీలించారు.

ప్రధాన రహదారుల్లో ఎల్ఈడీ లైటింగ్స్



స్తంభాలకు ఎల్ఈడీ రూప్ లైటింగ్స్ వేసిన దృశ్యం,

ఆదోని అర్బన్ : సంక్రాంతి పండగ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారుల్లో రూ.4 లక్షలతో నూతన కలర్ ఎల్ఈడీ రూప్ లైటింగ్స్‌ను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి శనివారం రాత్రి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లైటింగ్స్ ఏర్పాటు చేయడంతో పట్టణ అందం ద్విగిణీకృతమవుతుందన్నారు. ప్రధాన నగరాల్లో ఇలాంటి లైట్స్ ఉండటంతో అవి ఎంతో అందంగా కనిపిస్తున్నాయని ఇలాంటి వాటిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించిన వెంటనే రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారన్నారు. ఏరియా ఆస్పత్రి నుంచి ఆర్ట్స్ కళాశాల రోడ్డు, కొత్త బస్టాండు, ఎస్కేడీ కాలనీ ప్రధాన రహదారుల్లో 55 స్తంభాలకు నూతనంగా వివిధ రంగులతో ఎల్ఈడీ బల్బు రూప్ వే లైటింగ్స్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, ఎంఈఓ నాగభూషణం, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కమనీయం.. గోదాదేవి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : ధనుర్మాసం ముగింపు సందర్భంగా శనివారం స్థానిక నగరేశ్వర స్వామి ఆలయంలో ఆర్య వైశ్య సంఘం మహిళా మండలి సంఘం ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. ఉత్సవమూర్తులను విశేషంగా అలకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. పండితుల ఆధ్వర్యంలో వేడుకను వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. సంఘం సభ్యులు వి.టి.ప్రకాష్, వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, టి.జి.రాంప్రసాద్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్ : కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, 30 కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ హరికృష్ణ శనివారం విలేకరులకు తెలిపారు. ఆదోని సెబ్ అధికారులు జరిపిన దాడుల్లో బల్లేకల్ గ్రామ క్రాస్ రోడ్డు వద్ద తోవి గ్రామానికి చెందిన వీరేష్, రచ్చుమర్రి గ్రామానికి చెందిన వీరేష్, ఉరుకుంద అనే వ్యక్తులు ఒక కారు, ఒక మోటార్ సైకిల్‌పై 30 కర్ణాటక మద్యం బాక్సులు రవాణా చేస్తుండగా అరెస్టు చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.ఎస్ఐలు శివప్రసాద్, రోహిణి, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భోగి పండుగ

ఆదోని అర్బన్ : సంక్రాంతి పండగను పురస్కరించుకుని భోగి సందర్భంగా శనివారం తెల్లవారుజామున పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు భోగి మంటలు వేశారు. ఇంటి ముందు కల్లాపు చల్లి, రంగవల్లులతో తీర్చిదిద్దారు. మంగళస్నానాలు ఆచరించి, నూలు సద్ద రొట్టె, వివిధ కూరగాయాలతో కూర, పులగం, నువ్వుల పిండి వండి స్వామి వార్లకు నైవైద్యంగా సమర్పించారు.

పెద్దకడబూరు : మండలంలో శనివారం సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మూడు రోజుల పాటు జరుపుకునే వేడుల్లో తొలిరోజు భోగి సందర్భంగా స్థానిక ముద్దురంగాగురుస్వామి మఠంలో వేకువజామున భోగి మంటలు వేసి నృత్యం చేసుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

ముగిసిన ధనుర్మాస పూజలు

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయస్వామి వారికి ధనుర్మాసం ముగింపు పూజలు శనివారం నిర్వహించారు. నెల రోజుల పాటు సూర్యుడు ఉదయించే లోపు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతి తదితర పూజలను ఆలయ మేనేజర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పూజారి గురురాజ ఆచారి నిర్వహించారు. మధ్యారాధన సందర్భంగా ఆదివారం గోపాలదాస ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ రాఘవేంద్ర తెలిపారు. వేకువజాము నుంచి ప్రత్యేకంగా మంటపంలో వెలిసిన గోపాలదాస స్వామివారికి అభిషేకం, పూల అలంకరణ, హోమం జరిపిస్తామని చెప్పారు. అలాగే స్వామి వారికి ప్రత్యేక పూజలు, పల్లకోత్సవం, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాయాయి. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, అగసలదిన్నెలోని దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.